క్లుప్తంగా

నేడు, రేపు శ్రీ లక్ష్మి సత్యదేవుడికి విశేష పూజలు

కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయంలో బుధ, గురువారాల్లో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతోత్సవం, ఇతర పూజోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శ్రీ సత్యనారాయణస్వామి సామూహిక వ్రతంలో జేష్ఠశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఉదయం 7.30 గంటలకు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ తెలిపారు. గురువారం ఆలయ 60వ వార్షిక కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని గడ్డిబజారులోని పురాతనమైన వైష్ణవాలయంలో లక్ష తులసి అర్చన, అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం తదితర పూజలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటితోపాటు ఉదయం 5.45 గంటలకు మహా సంకల్పం, విశ్వక్సేన ఆరాధన, లక్ష తులసి అర్చన, సామూహిక లక్ష్మి విష్ణు సహస్ర నామ పారాయణం, శ్రీ లక్ష్మినారాయణ మహా సుదర్శన హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామని, సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

అధిక ఫీజు వసూళ్లను ఆపండి



ఐటీఐ సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న ఆర్‌ఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై మంగళవారం కడపలోని ఐటీఐ సర్కిల్లో నిరసన కార్యక్రమం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ జిల్లాలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. అలాగే పాఠ్యపుస్తకాలు, బూట్లు, టై, బెల్టు, యూనిఫామ్‌లను పాఠశాలలోనే కొనాల్సిందే అంటూ హుకుం జారీ చేస్తున్నారన్నారు. ఆ విద్యాసంస్థలను గుర్తించి ఆ పాఠశాలలపై విచారణ జరిపి చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేని పక్షంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యు నాయకులు శ్యామ్, కిరణ్, గురు, కొండయ్య, జై సింహ పాల్గొన్నారు.

ఎస్సీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి



ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న జయరాజు

కడప రూరల్ : ప్రభుత్వం ఎస్సీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు జయరాజు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్యలక్ష్మికి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ వర్గాల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతోపాటు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు.

వరిలో ఆరుతడి పద్ధతి సాగుతో అధిక దిగుబడి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఎం ప్రవీణ్‌కుమార్

కడప అగ్రికల్చర్: వరిలో ఆరుతడి పద్ధతి సాగుతో అధిక దిగుబడిని సాధించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కడపలోని జిల్లా ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌కి అంతః రాష్ట్రీయ వరి పరిశోధన కోర్ ప్రాజెక్ట్ గురించి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్ వివరించారు. వరిలో ఆరుతడి పద్ధతి, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. అలాగే కోర్ ప్రాజెక్టు సిబ్బంది ఈ శిక్షణలో వరిలో ఆరుతడి పద్ధతి ఏ విధంగా పాటించాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియ చేశారు. ఆరుతడి పద్ధతి సాగు వల్ల 30% వరకు సాగు నీరు ఆదా అవుతుందన్నారు. అలాగే మెరుగైన పంట ఎదుగుదల ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం వసంతకుమారి, అంకిత, పవన్, ప్రతినిధులు అఖిల్, ప్రిన్స్ పాల్గొన్నారు.





పొంచి ఉన్న ప్రమాదం

కడప నగరంలోని రింగురోడ్డులో ఆలంఖాన్ పల్లె సర్కిల్ నుంచి ఫాతిమా కాలేజీకు పోయే మార్గంలో కేసీ కాలువపై నిర్మించిన కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉంది. ఇక్కడ రోడ్డు తగ్గులో ఉండటం, కల్వర్టు ప్రక్కనే పెద్ద గుంత ఉండటం వల్ల వాహనాల వేగం అదుపు చేయలేకపోతే నేరుగా కేసీ కాలువలో పడిపోయే అవకాశం ఉంది. ప్రమాదాలు జరక్కుండా ఉండాలంటే కల్వర్టు గోడను పొడిగించడంగానీ, రెయిలింగ్ ఏర్పాటు చేయడం చేయాల్సి ఉంది. – ఫొటోలు: సాక్షిఫొటోగ్రాఫర్, కడప

తనువు, మనసుల సం'యోగం'



కడప కల్చరల్ : దేశమంతటా యోగ శిక్షణ గురించి జోరుగా చర్చ జరుగుతోంది. పది రోజులకు పైగా ప్రపంచ మంతటా చాలా దేశాల్లో కూడా యోగా గురించిన శారీరక శిక్షణ ఇవ్వడంలో ఆయా రంగాల నిపుణులు తమదైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మన దేశం ఈ అంశాల్లో చొరవ తీసుకుని ప్రపంచాన్ని అంతా యోగా దినోత్సవానికి సమాయత్తం చేయడంలో ఉన్నారు. ఈ రంగంలో అపారమైన నైపుణ్యం ఉండడంతో యోగా కార్యక్రమాల గురించి ప్రజలందరికీ ఈ అంశంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే శిక్షకులు, శిక్షణ పొందేవారు ఈ మేరకు సిద్ధమవుతున్నారు. ఈ అంశాల గురించి విస్తృతంగా ప్రచారం చేయడంలో ఇప్పటికే ఏర్పాట్లు జరుగుతున్నాయి. కడప నగరంలోని పలు ముఖ్య కూడళ్లలో ఆకర్షణీయంగా రంగులు వేస్తున్నారు. బ్యాక్‌గ్రౌండ్ డిజైన్లతో ఆకట్టుకునేలా యోగా చిత్రాలతో ఆయా ప్రాంతాలను అలంకరిస్తున్నారు. పలువురు యోగా మాస్టర్లు సూర్య నమస్కారాలు, యోగా భంగిమలు, షట్‌క్రియలు అర్థమయ్యేలా చిత్రాలు గీయిస్తున్నారు. జిల్లా అంతటా యోగాంధ్ర వాతావరణం ఉట్టిపడుతోంది.

రేపటి నుంచి సామూహిక యోగాభ్యసనం

కడప కల్చరల్ : ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య సంస్థ పిలుపు మేరకు కడప నగరంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నుంచి పది రోజుల పాటు ఉచిత యోగా శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధ్యక్షులు అనంతబొట్ల వెంకట సుబ్బయ్య తెలిపారు. మంగళవారం స్థానిక మానస ఇన్ సమావేశ మందిరంలో ఆయన ఇంటాక్ జిల్లా కన్వీనర్, జాతీయ కౌన్సిల్ సభ్యులు లయన్ కె.చిన్నపరెడ్డితో కలిసి అందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి పర్యవేక్షణలో ప్రతిరోజు ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు ఈ ప్రత్యేక యోగా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ యోగా థెరపిస్టు డాక్టర్ రంగనాథరెడ్డి పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు డాక్టర్ ఏవీ సుబ్బరాజు, లయన్ జోజిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఇంటాక్ కార్యాలయ కార్యదర్శి రాఘవేంద్రవర్మ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొమ్మినేని అరెస్ట్ అప్రజాస్వామికం

– దళితఫోరం జిల్లా ఛైర్మన్ కిషోర్ బూసిపాటి డిమాండ్



కడప కార్పొరేషన్: తెలుగు జర్నలిజంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న సీనియర్ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావును పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని దళిత ఫోరం జిల్లా ఛైర్మెన్ కిషోర్ బూసిపాటి తప్పుబట్టారు. కడపలోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లైవ్ డిబేట్‌లో మరో పాత్రికేయుడు అమరావతి ప్రాంతం మహిళల పట్ల చేసిన వ్యాఖ్యలకు కొమ్మినేని శ్రీనివాస్‌ను అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ఓ పత్రికలో వచ్చిన వార్తను ఉటంకిస్తూ సీనియర్ పాత్రికేయుడు క్రిష్ణంరాజు వ్యాఖ్యలు చేస్తుండగా....ఇలాంటి వ్యాఖ్యల గురించి మనం మాట్లాడుకుంటే బయట మరో విధంగా చర్చ జరుగుతుందని చెప్పి కొమ్మినేని అడ్డు చెప్పారన్నారు. కానీ డైవర్షన్ పాలిటిక్స్‌కు అలవాటు పడిన కూటమి ప్రభుత్వం కొమ్మినేని శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి, సాక్షి కార్యాలయాలపై దాడులు చేయించడం దారుణమన్నారు. ఒక సీనియర్ పాత్రికేయున్ని అరెస్ట్ చేస్తే జర్నలిస్టు యూనియన్లు స్పందించకపోవడం గర్హనీయమన్నారు. కొమ్మినేనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు కూడా నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణం కొమ్మినేనిపై నమోదు చేసిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చాలాకాలంగా కొమ్మినేని పై టీడీపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. అందులో భాగంగానే ఇప్పుడు కేసు నమోదు చేసి అన్యాయంగా జైలుకు పంపించారన్నారు. ఈ అన్యాయాన్ని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణం స్పందించి ఆయన పైన నమోదు చేసిన కేసులను ఎత్తివేసి ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

భవనంపై నుంచి జారిపడి వ్యక్తి మృతి



వెంపటి శ్రీనివాస్ మృతదేహం

కడప అర్బన్: కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 9వ తేదీన సాయంత్రం నెహ్రూపార్క్ ఎదురుగా నిర్మాణంలో వున్న ఓ భవనం రెండవ అంతస్తు నుంచి జారిపడి బేల్దారి పనిచేసే వెంపటి శ్రీనివాస్ (40) అనే వ్యక్తి మృతి చెందాడు. గుంటూరు జిల్లా ఇటుకంపాడు రోడ్, పొన్నూరుకు చెందిన శ్రీనివాస్ బేల్దారి పనిచేసేందుకు కడపకు వచ్చాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు వున్నారు. బేల్దారి పనిచేసిన తరువాత స్నానానికి వెళుతుండగా ఈప్రమాదం జరిగిందనిని పోలీసుల విచారణలో తేలింది. ప్రమాదం జరిగిన వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. తరువాత రిమ్స్‌కు తీసుకుని వెళ్లగా మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుని సోదరుడు సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప ఒన్‌టౌన్ ఎస్‌ఐ జి. అమర్‌నాథ్‌రెడ్డి తెలియజేశారు. రిమ్స్‌లో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ప్రారంభమైన భీమేశ్వరస్వామి తిరునాల

పెండ్లిమర్రి : మండలంలోని వేలూరుపాడు గ్రామసమీపంలో వెలసిన శ్రీభీమేశ్వరస్వామి తిరునాల ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్వామివారికి అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, ఆకుపూజ వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి కాయ కర్పూరాలతో మొక్కులు తీర్చుకున్నారు.

నేడు శివపార్వతుల కల్యాణం

భీమేశ్వరస్వామి తిరునాల ఉత్సవాల సందర్భంగా బుధవారం ఉదయం 9.55గంటల నుంచి శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయ అవరణలో ఎద్దులచే బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశామన్నారు.

ఈ పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యాజమానులకు మొదటి బహుమతి రూ.1లక్ష, రెండవది రూ. 80 వేలు, మూడవది రూ.60 వేలు, నాల్గవది రూ.40 వేలు, ఐదవది రూ.20 వేలు అందజేస్తామని నిర్వాహకులు తెలియజేశారు.

సేంద్రియ వ్యవసాయ విధానాన్ని పాటించాలి

ప్రొద్దుటూరు రూరల్ : సేంద్రియ వ్యవసాయ విధానాన్ని రైతులు పాటించాలని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని కామనూరు, చెన్నమరాజుపల్లె, ఉప్పరపల్లె, కొత్తపల్లె, తాళ్లమాపురం, నంగనూరుపల్లె, లింగాపురం గ్రామాల్లో మంగళవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు సేంద్రీయ వ్యవసాయం, పాడి అభివృద్ధిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయనిక ఎరువులను, పురుగు మందుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులను, కషాయాలను ఉపయోగించాలని తెలిపారు. ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త భాగవతప్రియ వరి, మినుము, శనగ రకాలు, విత్తన శుద్ధి, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణల గురించి రైతులకు వివరించారు. రైతుల సందేహాలకు సమాధానాలు చెప్పారు. ఉద్యాన శాస్త్రవేత్త ఫిరోజ్ హుస్సేన్ చీని, నిమ్మలో వచ్చే తెగుళ్ల నివారణ గురించి వివరించారు. పశువైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయకుమార్ పశుగ్రాస రకాలు, శాస్త్రీయ పశుపోషణ, అధిక పాల ఉత్పత్తి, కృత్రిమ గర్భధారణ గురించి తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ బీటీఎం చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో లాభాలు

వల్లూరు : రైతులు వ్యవసాయ భూములలో భూసార పరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా పంటలను సాగు చేయడం వలన మంచి ఫలితాలు పొందవచ్చని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ ఏ వీరయ్య అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని దిగువపల్లి, అంబవరం గ్రామాలలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భూసార పరీక్షల ప్రాముఖ్యత, వాటిని అనుసరించి ఎరువుల యాజమాన్యం చేయడం వలన లాభాలను వివరించారు. శాస్త్రవేత్త డాక్టర్ కే సాయిమహేశ్వరి పాల్గొన్నారు .

ఎన్నికల హామీలు అమలు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ఎన్నికల హామీల అమలు చేయాలని కడప తహ సీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు సాధికారత కల్పించడానికి దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్న సమగ్ర కేంద్ర చట్టాన్ని అమలు చేయలేదన్నారు. భూమిలేని వారందరికీ, దళితులకు వ్యవసాయ కార్మికులకు తగిన ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పని కల్పించి రోజువారి వేతనం ఇవ్వాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి కూలీలకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. వ్యవసాయ కార్మికులందరికీ 55 సంవత్సరాలు వయసులో నెలకు రూ.10 వేలు వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీకేఎంయూ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, కౌలు రైతుల జిల్లా గౌరవ అధ్యక్షులు మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ బదిలీల్లో ఇష్టారాజ్యం

కడప సెవెన్‌రోడ్స్: కడప నీటిపారుదల శాఖ బదిలీల్లో నిబంధనలకు పాతర వేశారని ఆ శాఖ సిబ్బంది ఆరోపించారు. ఎన్జీఓ నాయకులు శ్రీనివాసులు, జిలానీ, నాగరాజ శేఖర్ చక్రం తిప్పి పర్యవేక్షక ఇంజినీరు రవికిరణ్ ద్వారా ఈ బదిలీల పక్రియ సాగించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సాధారణ బదిలీల ప్రక్రియ సోమవారం నాటికే పూర్తి కావాల్సి ఉండగా, ఇప్పటివరకు బదిలీల ఉత్తర్వులు ఇవ్వలేదని తెలిపారు. సర్వీసు పూర్తి చేసుకున్న వారిని ఖచ్చితంగా బదిలీ చేయాల్సి ఉంటుందని, అయితే కొంత మందిని మెడికల్ గ్రౌండ్ కింద అలాగే ఉంచారని చెబుతున్నారు. మెడికల్ గ్రౌండ్స్ పేరుతో ఓ మహిళా ఉద్యోగిని అక్కడే ఉండచం చర్చనీయాంశమైంది.

విజయదుర్గమ్మ సన్నిధిలో పూజలు



కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పౌర్ణమి సందర్భంగా బుధవారం అమ్మవారికి ఉదయం 10 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, అనంతరం చండీహోమం నిర్వహించనున్నారు. సాయంత్రం దీపాలంకార సేవ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలియజేశారు.

డ్రగ్స్ జోలికి వెళ్లవద్దు



కడప అర్బన్: డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కడప ట్రాఫిక్ సీఐ డి.కె జావీద్ తెలియజేశారు. మంగళవారం కడప ట్రాఫిక్ సీఐ తమ సిబ్బందితో కలిసి కడప ఆర్టీసి బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు, శంకరాపురంలోని ప్రైవేట్ వాహనాల డ్రైవర్లకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వారితో మాట్లాడారు. సమాజంలో గంజాయి, మత్తు కలిగించే డ్రగ్స్‌ను కొందరు యువకుల నుంచి వ్యక్తుల వరకు వినియోగించి వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారన్నారు. డ్రైవర్లుగా వాహనాలను నడిపే వారు ఎవరైనా వ్యసనాలకు దూరంగా వుండాలన్నారు. తమను నమ్ముకుని వాహనం ఎక్కిన వారిని జాగ్రత్తగా వారివారి గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత ప్రతి డ్రైవర్‌పైనా వుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్రగ్స్‌కు దూరంగా వుండాలనీ, నిబంధనలను పాటించాలనీ డ్రైవర్లు, వాహనాల యజమానులచేత పోస్టర్‌లను ఆవిష్కరింపచేశారు. ఈ కార్యక్రమంలో వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.

టీచర్ల నిరీక్షణ



సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు (ఎస్‌జీటీ) బదిలీల ప్రక్రియ చేపట్టారు. మంగళవారం డీఈఓ షేక్ షంషుద్దీన్ ఆధ్వర్యంలో కడప శంకరాపురంలోని స్కౌట్ హాల్‌లో మాన్యువల్ కౌన్సిలింగ్‌ను నిర్వహించారు. కౌన్సిలింగ్ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కావాలి. అయితే కొన్ని సాంకేతిక సమస్య తలెత్తడంతో రాత్రి 7 గంటలకు ప్రారంభమయింది. దీంతో మధ్యాహ్నం తరలివచ్చిన టీచర్లు ఇక్కట్లు పడ్డారు.

–ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

ఓ.. పాపా.. లాలీ..



ఓ పాపా లాలీ....జోజో లాలీ అంటూ ఊయలలో తన చిన్నారిని జోల పాట పాడుతూ నిద్రబుచ్చుస్తున్న దృశ్యం కడప నగరం స్కౌట్ హాలులో కనిపించింది. మంగళవారం విద్య శాఖ అధికారులు టీచర్ల బదిలీలకు కౌన్సిలింగ్ నిర్వహించారు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. తాగేందుకు మంచి నీరు లేక,అసలే ఉక్కపోత అపై వసతులు లేక ఉపాధ్యయులు నానా అవస్థలు పడ్డారు. చంటి పిల్లలతో వచ్చిన వారు ఇబ్బందులు పడ్డారు.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప